క్లుప్తంగా

నేడు వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి లింగాపురంలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సాయిబాబా సేవాశ్రమం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు 8.30 గంటలకు ఉచిత సాయిసత్య వ్రతం, 10గంటలకు చందనోత్సవం, మధ్యాహ్నం హారతి, ఊరేగింపు, 3 గంటలకు సత్సంగం, 6 గంటలకు ధూపహారతి వంటి పూజాకార్యక్రమాలు ఉంటాయన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొని బాబాను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని శ్రీ షిర్డీసాయి సేవాశ్రమప్రతినిధులు కోరారు.

చర్చి ప్రారంభం

పోరుమామిళ్ల : మండలంలోని తోకలపల్లెలో గురువారం నూతనంగా నిర్మించిన సెయింట్ ఆంటోనీ చర్చిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్‌రెడ్డి, స్థానిక పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ వితరణ



రైల్వే స్టేషన్ మాస్టర్ జిలాన్‌కు వీల్ చైర్ అందిస్తున్న కొవ్వూరు రమేష్ రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వూరు ట్రాన్స్‌పోర్టు అధినేత, సీనియర్ రొటేరియన్ కొవ్వూరు రమేష్ రెడ్డి సహకారంతో ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ మాస్టర్ జిలాన్, టీఎస్‌సీ రమేష్‌లకు గురువారం వీల్ చైర్ అందించారు. రోటరీ క్లబ్ సెక్రటరీ గజ్జల వెంకటేశ్వరరెడ్డి, స్టేషన్ మాస్టర్ జిలాన్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడే ప్రయాణికుల కోసం కొవ్వూరు రమేష్ రెడ్డి వీల్ చైర్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ రామకృష్ణ, అయూబ్‌ఖాన్, కోశాధికారి బాల సూర్యరావు, పల్స్ పోలియో అధికారి శ్రీధర్ శర్మ, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ రాజీనామా



పోకల రామకృష్ణారెడ్డి

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఏపీ టూరిజం ఎండీ కన్నబాబుకు ఫ్యాక్స్ ద్వారా తన రాజీనామాను పంపి ఆమోదించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ రాజీనామా

రాజుపాళెం : మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవికి ముక్కర్ల నరసింహారెడ్డి గురువారం రాజీనామా పత్రాన్ని అందించినట్లు ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు తెలిపారు. ప్రొద్దుటూరులోని తన కార్యాలయంలో గురువారం నరసింహారెడ్డి రాజీనామా పత్రాన్ని అందించినట్లు ఈఓ పేర్కొన్నారు.

రక్తదాతకు సన్మానం



సన్మానం అందుకుంటున్న పల్లవోలు రమణ

చాపాడు : ప్రొద్దుటూరులో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదాతలు, ప్రోత్సాహకులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన పల్లవోలు రమణను 21 సార్లు రక్తదానం చేసినందుకు గాను సన్మానించారు.

రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దక్షిణ కువైట్‌లోని మంగాఫ్ ప్రాంతంలో భారతదేశానికి చెందిన కార్మికులు నివసించే బహుళ అంతస్తులు అగ్నికి ఆహుతి అయి చనిపోయిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నామమాత్రం రూ.2 లక్షలు కాకుండా కువైట్ ప్రభుత్వంతోనూ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతోనో చర్చలు జరిపి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా కోరారు. గురువారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సహకారం అందించాలని, వీలైనంత త్వరగా మృతదేహాలను గుర్తించి వారి స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు, నాయకుడు ఎస్.దస్తగిరి పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా సాగింది. ఉదయం 11 గంటలకు ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివార్లకు హనుమంత వాహనంపై గుడి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, అన్నప్రసాద దాతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాలను అర్హులకు వేయాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య

ప్రొద్దుటూరు క్రైం : అర్హులందరికీ వయోజన బీసీజీ టీకా వేయాలని స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య తెలిపారు. పట్టణంలోని కేసీ పుల్లయ్య అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న వయోజన బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఏఎన్‌ఎంలు వేస్తున్న వ్యాక్సినేషన్‌ను రూట్‌లను పరిశీలించి సూచనలు చేశారు. ఇచ్చిన టార్గెట్‌ను ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని చెప్పారు. ప్రజలకు టీకాపై అవగాహన కల్పించి వేయించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవిబాబు, వైద్యాధికారులు బి శివప్రసాద్‌రెడ్డి, దినేష్‌బాబు, డీపీఎంఓ శివశంకరయ్య, టీబీ సూపర్‌వైజర్ బి రాజారత్నం, హెల్త్ విజిటర్ సిద్ధారెడ్డి, ప్రసాద్, మున్నా, సీఓ ఎంపీ సుబ్బారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భక్తులపై ఉగ్రవాదుల కాల్పులు దారుణం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : దైవదర్శనానికి వెళ్లి వస్తున్న భక్తులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి చంపడం దారుణమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జున పేర్కొన్నారు. తీవ్రవాదుల కాల్పులను నిరసిస్తూ గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న జమ్ములోని వైష్ణవి దేవి ఆలయాన్ని దర్శించుకుని వస్తున్న భక్తుల బస్సుపై పాక్ ఉగ్రవాదులు దాడులు జరపడంతో బస్సు లోయలో పడి 10 మంది చనిపోయారని, 36 మంది తీవ్రగాయాల పాలయ్యారన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యలపై కేంద్ర హోంమంత్రిత్వశాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుని ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని డిమాండ్ చేశారు. అలాగే గోవులను వధించకూడదనే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు మారెళ్ల మల్లిఖార్జునరావు, జింకా మార్కండేయ, చలపతి, దశమందం బాబు, సురేష్, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషకు పట్టం కట్టాలి



మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హనుమంతరావు తదితరులు

గోపవరం : తెలుగుభాషకు పట్టం కట్టి ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టాలని తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. గురువారం మండలంలోని కవయిత్రిమొల్ల స్మారక మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాల క్రితమే తెలుగుభాషను సుసంపన్నం చేసిన కవయిత్రిమొల్ల, సంఘ సంస్కర్త వీరబ్రహ్మం, పద కవితా పితామహులు తాళ్ళపాక అన్నమయ్య, సుమతి శతక కర్త బద్దెన, ఆంగ్ల చక్రవర్తి సి.పి.బ్రౌన్, తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క తదితరులు తెలుగుభాషను ఆరాధించారన్నారు. తెలుగుభాషకు సమర్థుడైన రాష్ట్ర అధ్యక్షుడిని నియమించి ప్రపంచ తెలుగు మహాసభలను వైభవంగా నిర్వహించాలని కోరారు. ముందుగా మహాకవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్, కోశాధికారి గుమ్మళ్ల శ్రీనివాసులు, జ్యోతిరావుఫూలే ఆశయ సాధన సమితి చైర్మన్ గురుమూర్తి, ఆవాజ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు.

గురువారం భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఏవైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, చిన్నప్ప, సర్వోత్తమరెడ్డి, బయపురెడ్డి, నాగెళ్ల సాంబశివారెడ్డి, రవికుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రసూల్, గంగాధరరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెత్తుతో సురక్షితంగా పసుపు కొమ్ములు



కుప్పగా పోసిన విత్తన కొమ్ములు



టంగుటూరులో పసుపు కొమ్ములను మెత్తు వేసిన దృశ్యం

రాజుపాళెం : విత్తన పసుపు కొమ్ములు మెత్తుతో సురక్షితంగా ఉంటాయని టంగుటూరు గ్రామ రైతులు అంటున్నారు. పసుపు పంట నూర్పిళ్ల తర్వాత కొమ్ములు నాణ్యతగా ఉంటే వాటిని చెట్ల కింద ఉంచి.. గాలి తగలకుండా పేడ, మట్టి కలిపి కప్పుతారు. అవి మొదట్లో ఎలా ఉంటాయో రెండు, మూడు నెలల తర్వాత కూడా అలాగే ఉంటాయని రైతులు చెబుతున్నారు. ఈ విధానాన్ని 'మెత్తు' అంటారు. మరి కొంత మంది రైతులు ఇలా చేయడం కష్టమని, విత్తనం వేసే ముందు విత్తన కొమ్ములను తెచ్చుకుంటామని పేర్కొన్నారు. ఎంత నష్టం వచ్చినా అలవాటైన పంటనే సాగు చేస్తామని ఆ గ్రామ రైతులు చెబుతుండటం విశేషం. ఆ గ్రామంలో ఏటా దాదాపు 210 ఎకరాల్లో ఈ పంట సాగవుతుంది. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలా మంది ఏసీ గోదాముల్లో నిల్వ చేసినట్లు రైతులు తెలిపారు. ఈ ఏడాది ధరలు బాగుండటంతో ఈ పంట సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావులు, కుందూ నది కింది వారం, పది రోజుల్లో పసుపు పంటను సాగు చేయనున్నట్లు వారు తెలిపారు.

నేడు రక్తదాన దినోత్సవ కార్యక్రమాలు

కడప కల్చరల్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తమ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన సంస్థ కార్యాలయంలో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. ఉదయం నుంచి పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించడం, పాఠశాలల్లో విద్యార్థులకు రక్త గ్రూపుల నిర్ధారణ చేయడం, అధికసార్లు రక్తదానం చేసిన దాతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేయడం, 50 సార్లకు పైగా రక్తదానం చేసిన వారందరికీ, రక్తదాన శిబిరాల నిర్వహణలో సహకరించిన సంస్థలకు, కార్యక్రమాలకు సహకరించిన ప్రభుత్వ సంస్థలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. కడప నగరం మట్టిపెద్దపులి ప్రాంతంలోని తమ సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో 18–65 సంవత్సరాలలోపు వయస్సుగల వారు పాల్గొని రక్తదానం చేయవచ్చన్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ నంబర్లు మార్పు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతిరోజు కడప–విశాఖపట్టణం మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నంబర్లు మార్పు చేశారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. కడప–విశాఖపట్టణం–కడప మధ్య నడిచే ఈ రైలు ప్రస్తుతం 17487/17488 నంబర్లతో నడుస్తోందన్నారు. జులై 1వ తేది నుంచి ఈ రైలు 18521/18522 నంబర్లతో నడుస్తుందన్నారు. ఈ మేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ రైలుకు రిజర్వేషన్ చేసుకోబోయే ప్రయాణీకులు ఈ మార్పును గుర్తించాలని సూచించారు.

గేట్లు ఏర్పాటు చేయాలి

పులివెందుల రూరల్ : పట్టణంలోని సర్వజన ఆసుపత్రి వద్ద గేట్లు ఏర్పాటు చేయాలని ఆసుపత్రికి వచ్చే రోగులు అధికారులను కోరుతున్నారు. అత్యవసర రోగులను 108 వాహనంలో ఆసుపత్రిలోకి తీసుకువచ్చేటప్పుడు ఆసుపత్రి వద్ద ద్విచక్ర వాహనాలు అడ్డంగా ఉంటాయన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గేట్లు లేకపోవడంతో ఆసుపత్రి ఆవరణలో సిబ్బంది, సెక్యూరిటీ తాడును తాత్కాలికంగా ఏర్పాటు చేసి వాహనాలను ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా చర్యలు చేపట్టారు. ఇది చూసి ఆసుపత్రికి వచ్చే రోగులు తాడు లేకుండా గేట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాలరాజుపల్లెలో బండలాగుడు పోటీలు



బాలరాజుపల్లెలో బండలాగుతున్న వృషభాలు

కాశినాయన : మండలంలోని బాలరాజుపల్లె గ్రామంలో శ్రీరామాలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా చౌటపల్లె గ్రామానికి చెందిన చంద్రఓబుల్‌రెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.70 వేలు, నంద్యాల జిల్లా గుంపురుమాండ్లదిన్నె గ్రామానికి చెందిన రాంభూపాల్‌రెడ్డి వృషభాలు రెండవ బహుమతి రూ.40 వేలు, చౌటపల్లె గ్రామానికి చెందిన చంద్రఓబుల్‌రెడ్డి వృషభాలు మూడవ బహుమతి రూ.20 వేలు, వైఎస్సార్ జిల్లా బాలుగారిపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.10 వేలు, నంద్యాల జిల్లా మూడురాళ్ళపల్లె గ్రామానికి చెందిన చిన్నఓబుల్‌రెడ్డి వృషభాలు ఐదవ బహుమతి రూ.5 వేలు, వైఎస్సార్ జిల్లా ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు రూ.5 వేలు గెలుచుకున్నాయి. వీరికి గ్రామ పెద్దలు నగదు బహుమతిని అందజేశారు.

పెరటి తోటల పెంపకంతో లాభాలు



కూరగాయ విత్తన కిట్లను అందుకున్న రైతులతో కేవీకే శాస్త్రవేత్తలు

మైదుకూరు : పెరటి తోటల పెంపకంతో ఎన్నో లాభాలున్నాయని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. బి.మఠం మండలం రేకలకుంట గ్రామంలో గురువారం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ద్వారా ఎస్సీ రైతులు, మహిళలకు పెరటి తోటల పెంపకానికి అవసరమైన కూరగాయల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే అధిపతి బాలకృష్ణ మాట్లాడుతూ పెరటి తోటల పెంపకంతో కుటుంబానికి కావాల్సిన కూరగాయలు అందడమే కాక, కూరగాయలను విక్రయించడం ద్వారా కుటుంబానికి ఆదాయం లభిస్తుందన్నారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ మాట్లాడుతూ పెరటి తోటల పెంపకంపై మెళకువలను వివరించి రైతులకు శిక్షణ ఇచ్చారు. విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి మాట్లాడుతూ పెరటి తోటల్లో వచ్చే చీడపీడలు, వాటి నివారణ గురించి వివరించారు. కూరగాయల పంటల్లో విత్తన శుద్ధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బద్వేలు వ్యవసాయ సహకార సమాఖ్య చైర్మన్ మునయ్య, సర్పంచ్ జ్యోత్స్న, సత్యరాజ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

తెరచుకున్న పాఠశాలలు



పాఠశాలకు హాజరైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం తెరచుకున్నాయి. తొలిరోజు కొందరు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు రాగా మరికొంతమంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొత్తగా చేరే విద్యార్థుల అడ్మిషన్‌లలో బిజీగా ఉన్నారు. మండలంలో 112 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లాపరిషత్ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు ఉచిత స్టూడెంట్ కిట్లను సరఫరా చేయడానికి మండల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 1.50 లక్షల పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందించాల్సి ఉంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్ట్, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, ఒకటి, ఆరో తరగతి విద్యార్థులకు డిక్షనరీ తదితర విద్యాసామాగ్రిని అందచేయనున్నారు.

ఎన్‌ఎంఎన్‌ఎస్‌కు ఎంపికైన హైస్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

చాపాడు : మండల పరిధిలోని నరహరిపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహ శాస్త్రీ తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.ఓబులేసు, బి.శివనాగేశ్వరిలు ఎన్‌ఎంఎంఎస్ కోసం నిర్వహించిన పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ మంజూరవుతుందన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు సురేంద్రబాబు, మురళీలతో పాటు స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను గురువారం ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

21 నుంచి శ్రీ సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవం

కడప కల్చరల్ : కడప నగరంలోని గడ్డిబజారులో గల శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 21వ తేది నుంచి వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహించనున్నామని ప్రధాన అర్చకులు రాజేష్ భట్టర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయాలలో ఈ ఆలయం మొట్టమొదటిదని, దాదాపు 60 సంవత్సరాలుగా ఆలయంలో ఒకే కుటుంబం ఆధ్వర్యంలో పూజోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 22న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 21న ఉదయం 7.30 గంటలకు భక్తులచే సామూహికంగా శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహింపజేస్తున్నట్లు తెలిపారు. 22న ఉదయం 7.00 గంటల నుంచి శ్రీ లక్ష్మినారాయణ, సుదర్శన హోమం, మధ్యాహ్నం 12.30 గంటలకు మహాపూర్ణాహుతి, నక్షత్ర కుంభ హారతి, వేదాశీర్వచనం నిర్వహిస్తామన్నారు.

చదువులమ్మ చెట్టునీడలో..

జిల్లాలోని యువతకు ఉన్నత విద్యనందించాలన్న లక్ష్యంతో 1948లో ఏర్పాటైన కళాశాలకు.. 1952లో అప్పటి ముఖ్యమంత్రి సర్ సి.వి. రాజగోపాలాచారి చేతుల మీదుగా పునాదిరాయి పడగా... 1955లో మద్రాసు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ లక్ష్మణస్వామి ముదలియార్ చేతుల మీదుగా ప్రారంభమైంది. నేడు అదే ప్రాంతంలో ఆకట్టుకునే భవన నిర్మాణాలతో ఆర్ట్స్ కళాశాలగా రూపుదిద్దుకుంది. 1967లోనే 2 (ఎఫ్), 12 (బి) హోదాను సాధించిన కళాశాలగా.. 2003–04 సంవత్సరంలో తొలిసారిగా న్యాక్ గ్రేడ్ సాధించిన కళాశాలగా ఎందరో విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎమ్మెల్యేలు, మంత్రులుగా తీర్చిదిద్దిన చదువుల కోవెల జూన్ 14వ తేదీన వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించుకుంటున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

- నేడు ఆర్ట్స్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం
- మరోవైపు ప్లాటినం జూబ్లీ వేడుకలకు సన్నద్ధం



ఆర్ట్స్ కళాశాల ముఖద్వారం

వైవీయూ : మద్రాసు ప్రభుత్వంలో 1948లో ఏర్పాటైన విద్యాలయం దాదాపు 75 సంవత్సరాల పాటు రాయలసీమ ప్రాంత ప్రజలకు విద్యాసుగంధాలు వెదజల్లుతూనే ఉంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం అనుబంధంతో ఏర్పాటైన కడప ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలగా ప్రారంభమైంది. అనంతరం 1968లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంకు అనుబంధంగా, 2008లో కడప యోగివేమన విశ్వవిద్యాలయంకు అనుబంధంగా ఉండేది. 2003–04 విద్యా సంవత్సరంలో జిల్లాలోనే తొలి న్యాక్ గ్రేడ్ సాధించన కళాశాలగా చరిత్రకెక్కింది. 2012–13లో స్వయంప్రతిపత్తి సాధించి అటానమస్ హోదాతో ప్రతియేటా దాదాపు 2వేల మందికిపైగా విద్యార్థులకు సేవలందిస్తోంది. తాజాగా జూన్ 14వ తేదీన కళాశాలలో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఈ వేడుకలకు కళాశాల పూర్వ విద్యార్థి, ఏపీ పాఠశాల విద్య విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ పి. వీరభద్రారెడ్డి, పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి రిటైర్డ్ అయిన అధ్యాపకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలకు సన్నద్ధం..

కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకల నిర్వహణకు కళాశాల సన్నద్ధం అవుతోంది. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. కళాశాలలోని ఆడిటోరియంను దాదాపు రూ.50 లక్షల విరాళాలతో ఆధునీకరణ చేపట్టనున్నారు. ఆగస్టు నెలలో ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతుండటం విశేషం.

కళాశాల వివరాలు..

- 1948లో ప్రస్తుత జెడ్పీ ఆవరణంలో కళాశాల ఏర్పాటు.
- 1952లో ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి సర్ సీవీ రాజగోపాలాచారి చేతుల మీదుగా పునాదిరాయికి శిలాఫలకం ఆవిష్కరణ.
- 1954లో గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలగా ప్రస్తుతం ఉన్న భవనాల్లో తరగతులు ప్రారంభం.
- 1955 ఫిబ్రవరి 4వ తేదీన అప్పటి మద్రాసు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఎ. లక్ష్మణస్వామి ముదలియార్ చేతల మీదుగా కళాశాల భవనాలు ప్రారంభమయ్యాయి.
- 1967లో 2 (ఎఫ్), 12 (బి) హోదా.
- 1996లో జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల వేర్వేరు భవనాలు కేటాయింపు.
- 2003–04లో కళాశాలకు తొలిసారిగా 'బి' ప్లస్ ప్లస్ గ్రేడింగ్
- 2012–13లో కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా